ఫ్రీలెఫ్ట్‌ను బ్లాక్ చేయొద్దన్నందుకు కానిస్టేబుల్‌పై దాడి


నిందితుడు సొహైల్ అలీఖాన్

బంజారాహిల్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఫ్రీలెఫ్ట్‌కు అడ్డుగా పెట్టిన వాహనాన్ని తొలగించాలని చెప్పిన ట్రాఫిక్ కానిస్టెబుల్‌పై ఓ యువకుడు దాడి చేశాడు. గుడిమల్కాపూర్‌కు చెందిన ఉమామహేశ్వరరావు మూడేళ్లుగా బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 2న సీఎం బందోబస్తులో భాగంగా కేబీఆర్ పార్కు వద్ద ఉన్నాడు. ఆ సమయంలో క్యాన్సర్ ఆస్పత్రి నుంచి బంజారాహిల్స్ వైపు కారులో వెళ్తున్న సొహైల్ అలీఖాన్ సిగ్నల్ వద్ద ఫ్రీ లెఫ్ట్‌ను బ్లాక్ చేయడంతో కానిస్టేబుల్ ఫోటో తీయడంతో పాటు వాహనాన్ని తొలగించాలని కోరాడు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. కారు దిగిన యువకుడు ఉమామహేశ్వరరావుపై దాడి చేశాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి సొహైల్ అలీఖాన్‌ను అరెస్ట్ చేశారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ మోసం.. నిందితుడి అరెస్ట్

బంజారాహిల్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్‌కు చెందిన టి.వనజ, ఎల్.లక్ష్మీనారాయణ రెడ్డి, జె.హరిప్రసాద్ అనే నిరుద్యోగులకు ఎం.సాయికృష్ణారెడ్డితో పరిచయం ఏర్పడింది. సాయికృష్ణారెడ్డి ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పడంతో ముగ్గురూ కలిసి రూ.6.30 లక్షలు ఇచ్చారు. రోజులు గడుస్తున్నా ఉద్యోగాలు ఇవ్వలేదు. డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో రూ.71 వేలు తిరిగి ఇచ్చాడు. మిగతా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడంటూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థినితో ఉపాధ్యాయుడి అసభ్యకర ప్రవర్తన


వినయ్‌కుమార్

బంజారాహిల్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడు విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఫిలింనగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఓ ప్రైవేట్ పాఠశాలలో నేర్వరి వినయ్‌కుమార్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అదే పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న బాలికను ఈ నెల 2న ట్యూషన్ చెబుతానని తరగతి గదిలోకి పిలిచాడు. అనంతరం ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వినయ్ కుమార్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అధికారులు సీజ్ చేసిన భవనం

నివాస భవనంలో వ్యాపారం.. సీజ్ చేసిన అధికారులు

బంజారాహిల్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నివాసం కోసం అనుమతులు తీసుకొని భవన నిర్మాణం పూర్తయ్యాక వ్యాపారకలాపాలు సాగిస్తున్న భవనాన్ని జీహెచ్‌ఎంసీ అధికారులు సీజ్ చేశారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 92లో ఓ వ్యక్తి నివాస భవన నిర్మాణానికి అనుమతి తీసుకుని వ్యాపార సముదాయంగా వినియోగిస్తున్నాడు. విషయం తెలుసుకున్న జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేతలు చేపట్టారు. అయినప్పటికి యజమాని తిరిగి నిర్మాణాలు చేపట్టి వ్యాపారాలు సాగిస్తుండటంతో అధికారులు భవనాన్ని సీజ్ చేశారు.

మాలలు మనువాదులైతే.. మాదిగలు కమ్యూనిస్టులా..?

● తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాలలు మనువాదులైతే, మాదిగలు కమ్యూనిస్టులా? అని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ ప్రశ్నించారు. మాలలు మనువాదులని మంద కృష్ణ మాదిగ ఆరోపించడం సిగ్గుచేటని, అవగాహన లేకుండా మాట్లాడటం మంచిది కాదని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మాలలు మనువాదులు కాదని.. నిజమైన అంబేడ్కర్, పూలే వారసులన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, మనువాద, మతవాద పార్టీల పంచన చేరి ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

వర్గీకరణలో బైండ్ల కులానికి న్యాయం చేయాలి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో బైండ్ల కులానికి న్యాయం చేయాలని బైండ్ల భవనీయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏదుల్ల గౌరీశంకర్ అన్నారు. మంగళవారం ఏకసభ్య కమిషన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌ను కలిసి బైండ్ల కులానికి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2011 జనాభా ప్రకారం కేవలం 19 వేల మంది మాత్రమే ఉన్నట్లు బైండ్ల కులాన్ని చూపించారని, అవి తప్పుడు లెక్కలుగా పరిగణించి ప్రస్తుతం జరుగుతున్న సర్వే ప్రకారం బైండ్ల జానాభాను పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

అర్హత ఉన్నా అందని ఆసరా..!

● 90 శాతం వైకల్యం ఉన్నవారికి సైతం అందని పింఛన్
● ఏళ్లుగా ఎదురుచూస్తున్న బాధితులు
● దరఖాస్తు చేసుకున్నా కనిపించని ఫలితం
● అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై తీవ్ర విమర్శలు



బోరబండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తమకు అర్హత ఉన్నా దివ్యాంగ పింఛన్ అందడం లేదని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 90 శాతం వైకల్యం ఉన్నవారికి సైతం ఆసరా అందకపోవడంతో మానసిక ఆవేదనకు గురవుతున్నారు. దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా అర్హత ఉన్నవారికి సైతం పథకాలు అందించపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సబంధిత అధికారులు స్పందించి తమకు పింఛన్ ఇవ్వాలని దివ్యాంగులు కోరుతున్నారు.

40 శాతం మందికే పింఛన్లు

దివ్యాంగ పింఛన్ల కోసం అధికంగా బస్తీలో ఉండే వారే ఎదురుచూస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని బోరబండ, రహ్మత్‌నగర్, ఎర్రగడ్డ డివిజన్‌ల పరిధిలో సుమారు 2,200 మంది దివ్యాంగులు ఉండగా, వారిలో 40 శాతం మందికి మాత్రమే పింఛన్లు అందుతున్నట్టు లెక్కలు చెబుతున్నాయి. అర్హత ఉన్న చాలా మందికి పింఛన్ అందకపోవడంతో ఇప్పటికీ మండల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రహ్మత్‌నగర్ డివిజన్‌కు చెందిన ముగ్గురు కుటుంబ సభ్యులు ఆరు సంవత్సరాల క్రితం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఇందులో ఓ యువకుడు రెండు కాళ్లు పోగొట్టుకున్నాడు. దీనికి సంబంధించిన వైద్యపత్రాలు, ఎఫ్ఐఆర్‌తో పాటు దివ్యాంగ సర్టిఫికెట్ ఉంది. అతడు పలుమార్లు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అయినా ఇప్పటి వరకు రాలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు సదరు యువకుడిని పరామర్శించి తాము పింఛన్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ తర్వాత పట్టించుకున్న వారే లేరు. యూసుఫ్‌గూడలో ఓ వ్యక్తి దీపావళి సందర్భంగా టపాసులు కాలుస్తూ కన్ను పోగొట్టుకున్నాడు. అతడు ఎలాంటి పనిచేసుకోలేడని గుర్తించి వైద్యశాఖ సర్టిఫికెట్ అందజేసింది. అయితే ఇంత వరకు పింఛన్ అందలేదు.

వేల సంఖ్యలో పెండింగ్ దరఖాస్తులు

చాలా మంది దివ్యాంగులు నూతన పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. అయితే గత ఆరేళ్లుగా కొత్త పింఛన్లకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోవడంతో దరఖాస్తులన్నీ బుట్టదాఖలవుతున్నాయి. ఖైరతాబాద్ మండల కార్యాలయంలో సుమారు ఐదు వేల వరకు దరఖాస్తులు అందాయి. అమీర్‌పేట మండలంలో సుమారు మూడున్నర వేలు, షేక్‌పేటలో నాలుగు వేల పైచిలుకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

పింఛన్ అందడం లేదు



ఎర్రగడ్డ నేతాజీనగర్ పదో తరగతి చదువుతున్నా. వైకల్యంతో నడిచి వెళ్లలేకపోతున్నా. దాతలు ముందుకొచ్చి ఎలక్ట్రిక్ వాహనం అందిస్తే రోజూ బడికి వెళ్లి చదువుకుంటా. 79 శాతం వైకల్యం ఉన్నట్లు సదరం అధికారులు ధృవీకరించినా పింఛన్ అందడం లేదు.

- సరిబ అర్జుమాండ్, ఎర్రగడ్డ

80 శాతం వైకల్యం ఉన్నా ఇవ్వలే



పుట్టుకతోనే ఎడమ కాలు, చెయ్యికి పోలియో వచ్చింది. 80 శాతం వైకల్యం ఉందని సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. గత 37 సంవత్సరాలుగా దివ్యాంగుల పింఛన్ కోసం ఎదురుచూస్తున్నా. పోలియో ఉందని ఎవరూ జాబ్ ఇవ్వడం లేదు. భర్త రోజువారీ కార్మికుడు కావడంతో కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది

- జమీర్ ఉన్నిస, బోరబండ

సదరం స్లాట్ బుకింగ్‌లో సడలింపు ఇవ్వాలి



మంచానికే పరిమితమైన వారికి సదరం స్లాట్ బుకింగ్‌లో సడలింపు ఇవ్వాలి. ఏ ఆస్పత్రి వారు ఎవరికి ఇస్తారనే అవగాహన మీ సేవ సిబ్బందికి లేదు. స్లాట్ బుక్ చేసిన అనంతరం ఆ ఆస్పత్రికి వెళ్తే మీకు ఇక్కడ కాదు మరో ఆస్పత్రికి వెళ్లండని చెబుతున్నారు.

- జాలా నరేందర్ యాదవ్, ఖైరతాబాద్ టౌన్ దివ్యాంగుల సమాఖ్య అధ్యక్షుడు

మా సోదరుడి కుమార్తె వివాహానికి రండి

● సీఎంను ఆహ్వానించిన తలసాని

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తన సోదరుడి కుమార్తె వివాహానికి రావాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం సీఎంను ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రికను అందించారు.


మంత్రి జూపల్లి కృష్ణారావుతో కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

మంత్రి జూపల్లిని కలిసిన కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

బోరబండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన సంబురాలు ఘనంగా నిర్వహించాలని మంత్రి జూపల్లి కృష్ణారావు చెప్పారని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ తెలిపారు. మంగళవారం సచివాలయంలో మంత్రి జూపల్లిని కాంగ్రెస్ నాయకులతో కలిసి కార్పొరేటర్ కలిశారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రజాపాలన విజయోత్సవాల కళాయాత్ర గురించి మాట్లాడినట్లు ఆయన చెప్పారు. మంత్రిని కలిసిన వారిలో కె.మహేష్‌గౌడ్‌తో తదితరులు ఉన్నారు.


దివ్యాంగులకు వీల్ చైర్స్, చేతి కర్రలను అందజేసిన ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

దివ్యాంగులు మనోధైర్యంతో ఉండాలి

● ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

పంజాగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు మనోధైర్యంతో ఉండాలని, వారికి అన్నివేళల్లో అందుబాటులో ఉంటామని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మంగళవారం సిద్దార్థనగర్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన దివ్యాంగుల సాధికారత కార్యక్రమంలో ఆయన పలువురు దివ్యాంగులకు వీల్ చైర్స్, చేతి కర్రలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేట్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న వీణ, వాణిలకు తాము తోడుగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, దేదీప్య, జీహెచ్‌ఎంసీ సర్కిల్-19 డీఎంసీ జకీయాసుల్తానా, డీపీఓ వెంకట్ కిషన్‌రావు పాల్గొన్నారు.

బధిరులకు బాసటగా నిలవాలి


వేడుకలను ప్రారంభిస్తున్న జయేష్ రంజన్

బంజారాహిల్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): బధిరులకు బాసటగా నిలిస్తే అద్భుతాలు సృష్టిస్తారని ఐటీ, ఈసీ, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ అన్నారు. శ్రీనగర్ కాలనీలోని సత్యసాయినిగమాగమంలో మంగళవారం నిర్వహించిన దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరుదోగుల కోసం డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫ్ తెలంగాణ ప్లాట్‌ఫాంను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బధిరులకు అపారమైన తెలివితేటలు ఉంటాయని, వారికి ఇలాంటి ప్లాట్‌ఫాం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. బధిరులకు బాసటగా నిలుస్తున్న ఆశ్రయ్-ఆకృతి స్వచ్ఛంద సంస్థను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు.

బస్తీ దవాఖానాను సందర్శించిన కార్పొరేటర్


బస్తీ దవాఖానాలో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ టి.మహేశ్వరి

బేగంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని శ్యామ్‌లాల్ బిల్డింగ్‌లో నిర్వహిస్తున్న బస్తీ దవాఖానాను మంగళవారం కార్పొరేటర్ టి.మహేశ్వరి సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో మందులు లేవని, టెస్టులు చేయడం లేదని, డాక్టర్ అందుబాటులో ఉండటం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. దవాఖానాలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో నర్స్ మందులు ఇవ్వడాన్ని గమనించిన కార్పొరేటర్ డాక్టర్ ఎందుకు రాలేదని సిబ్బందిని ప్రశ్నించారు. వెంటనే ఫోన్ చేసి డాక్టర్‌తో మాట్లాడారు. అయితే మరో ప్రాంతంలో హెల్త్ క్యాంపు ఉండడం వల్లే రాలేదని చెప్పినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో బస్తీ దవాఖానాల్లో మందులు ఉండటం లేదని.. వైద్యసేవలు సరిగా అందడం లేదని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌యాదవ్, నాయకులు తాళ్ల రాజయ్య, టి.శ్రీహరి, నరేష్ పాల్గొన్నారు.


యోగా కేంద్రం పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మి

యోగాతో మానసిక సమస్యలు దూరం

● కార్పొరేటర్ కొలను లక్ష్మి

అమీర్‌పేట, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): బీకేగూడ పార్క్‌లో రూ.35 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న యోగా షెడ్డు పనులను మంగళవారం సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో యోగా అనేది ప్రతి ఒక్కరి దినచర్యలో భాగమైందన్నారు. యోగాతో మానసిక సమస్యలు, ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందన్నారు. త్వరలోనే ఈ యోగా కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోని తీసుకొస్తామని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, డివిజన్ ఇంజనీర్ సందీప్, ఉద్యానవన అధికారి సంధ్య, ఎస్ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షులు భరత్ ప్రసాద్ దూబే, అనంతరెడ్డి, సురేందర్ నాయి, శౌరిరెడ్డి పాల్గొన్నారు.



రహ్మత్‌నగర్‌లోని అమూల్ బేకరీ లైన్, అమర్ పాయింట్ లైన్ తదితర వీధుల్లో నీటి సమస్యను పరిష్కరించేందుకు చేపడుతున్న పనులను కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, వాటర్ వర్క్స్ మేనేజర్ సూర్యప్రకాష పరిశీలించారు.

- యూసుఫ్‌గూడ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి)



అనారోగ్యంతో వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన పలువురికి ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు అన్వర్ సాదత్, ఎస్.జాఫర్, వై.నగేష్ పాల్గొన్నారు.

- బంజారాహిల్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి)


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మెట్రో రైలు అధికారులు

మెట్రోభవన్‌లో వైద్య శిబిరం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకుని బేగంపేట్‌లోని మెట్రో రైల్‌భవన్‌లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. హెచ్ఎంఆర్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. బేగంపేట్ కిమ్స్-సన్‌షైన్ హాస్పిటల్ వైద్యుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో మెట్రో రైలు అధికారులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. దంత, కంటి పరీక్షలతో పాటు ఇతర సాధారణ పరీక్షలు నిర్వహించారు.

రైల్వే ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 'సంఘ్' పోరాటం

● ఎంప్లాయీస్ సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య


మర్రి రాఘవయ్య

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): భారతీయ రైల్వేల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎంప్లాయీస్ సంఘ్ పోరాటం చేస్తున్నదని సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య స్పష్టం చేశారు. రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు బుధవారం నుంచి జరగనున్న నేపథ్యంలో హైదరాబాద్‌కు వచ్చిన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైల్వేలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగుల నియామకాలకు వ్యతిరేకంగా పోరాడతామన్నారు. ఉద్యోగులు, అధికారులు తమ ఓటును రైలింజన్‌పై వేసి సంఘ్‌కు మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. 2004 తర్వాత నియమితులైన ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం ప్రయోజనాలను అందించేందుకు సంఘ్ కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.

కనీవిని ఎరుగని రీతిలో విజయోత్సవాలు

● ఎమ్మెల్యే దానం నాగేందర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కనీవిని ఎరుగని రీతిలో ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలుచేయడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. బంజారాహిల్స్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అయితే బీజేపీ చార్జిషీట్ పేరిట తప్పుడు ప్రచారం చేస్తుందన్నారు. కేంద్రమంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఇప్పటి వరకు ఎందుకు నెరవేర్చలేదని ఆయన ప్రశ్నించారు. రూ.10 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సీఎం హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 7న పేదలకు దుప్పట్ల పంపిణీ, అన్నదానాలతో పాటు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తామని.. 9న సచివాలయం వద్ద రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, రేవంత్‌రెడ్డి, భట్టివిక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేయనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రాములు చౌహాన్, అరుణ్‌కుమార్, నారికెళ్ల నరేష్, శ్రీనివాస్, రాజేష్ పాల్గొన్నారు.

విజయోత్సవాలను ఖైరతాబాద్‌లో ఘనంగా నిర్వహిస్తాం

● కార్పొరేటర్ విజయారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న విజయారెడ్డి

ఖైరతాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఘనంగా జరుపుకుందామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కార్పొరేటర్ విజయారెడ్డి పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణపై మంగళవారం ఖైరతాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆమె పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రతిరోజూ రెండు డివిజన్లలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి నాయకుడు, కార్యకర్త విజయోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు.

డా.సతీష్‌కుమార్ రెడ్డికి సన్మానం



డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా ఆర్థోడెంటిస్టు డాక్టర్ కే.సతీష్‌కుమార్ రెడ్డి నియమితులయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సతీష్‌కుమార్ రెడ్డిని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ డెక్కన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం జూబ్లీహిల్స్‌లోని హైదరాబాద్ జింఖానాలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నిరంజన్ రెడ్డి, శ్రీకాంత్, వైఎస్ రెడ్డి, డాక్టర్ ఆదిత్య సందీప్, ఫరీన్ మిర్జా, కరుణాకర్, మహేశ్, కేవీ రమణా రెడ్డి, రవీంద్ర పాల్గొన్నారు.

- హైదరాబాద్ సిటీ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి)


బీజేపీ రూపొందించిన చార్జిషీట్‌ను విడుదల చేస్తున్న లంకల దీపక్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, కుంభాల గంగరాజు తదితరులు


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, సెంట్రల్ జోన్ బీజేపీ అధ్యక్షుడు గౌతమ్‌రావు

కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత

● బీజేపీ నేత లంకల దీపక్ రెడ్డి

బంజారాహిల్స్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలను అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రజాపాలన పేరిట విజయోత్సవాలు నిర్వహిస్తుందని జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి విమర్శించారు. నాగార్జుననగర్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ వైఫల్యాలపై ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు రూపొందించిన చార్జ్‌షీట్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే 66 మోసాలతో ప్రభుత్వం ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను చవిచూస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పేరుతో ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మూసీ నది ప్రక్షాళనకు తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రభుత్వ విధానాలకే తాము వ్యతిరేకమన్నారు. హైడ్రా పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఈ నెల 5న కార్మికనగర్ ఆటోస్టాండ్ వద్ద బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నట్లు దీపక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కుంభాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, కొలన్ సత్యనారాయణ, సుప్రియ, డి.నాగేశ్వరరావు, బి.జ్యోతి, మల్లేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఖైరతాబాద్ బీజేపీ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ఖైరతాబాద్ బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం బంజారాహిల్స్, వెంకటేశ్వరనగర్‌కాలనీ డివిజన్‌లలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, సెంట్రల్ జోన్ అధ్యక్షుడు గౌతమ్‌రావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఒక్క హామీని కూడా సరిగా నెరవేర్చడం లేదన్నారు. ఏడాదిలోనే ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నా విజయోత్సవాలు నిర్వహించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.



మహేంద్రహిల్స్‌లోని గురుకుల బాలికల పాఠశాల (హాస్టల్) లో విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

గురుకుల పాఠశాలను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే

మారేడుపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహేంద్రహిల్స్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల (హాస్టల్)ను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ మంగళవారం పరిశీలించారు. పాఠశాలలో అందుతున్న భోజన సదుపాయాలు, మౌలిక వసతుల గురించి విద్యార్థినులను వారు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని వంటగదిని పరిశీలించి కూరగాయలు, నిత్యావసర వస్తువుల మెనూతో పాటు వంట గదిలో నిలువ ఉంచే వస్తువులను, రిజిస్టర్‌ను పరిశీలించారు. వంటగది పరిశుభ్రంగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులకు ఆహారం విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది పాఠశాల యాజమాన్యానికి సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన ఆహారంతో పాటు సకల సదుపాయాలు కల్పిస్తోందని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. నిరంతర ప్రక్రియగా నియోజకవర్గంలోని హాస్టళ్లను తనిఖీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

బొల్లారంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

తిరుమలగిరి డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి) : కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని బొల్లారం ప్రాంత అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. మంగళవారం బొల్లారం సాధనా మందిర్ వద్ద పవర్ బోర్‌వెల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ ప్రాంతంలో నీటి సమస్యను తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేయడంతో బోర్‌వెల్ వేస్తున్నామని అన్నారు బొల్లారంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు.. కాలనీలు, బస్తీల్లో ఉన్న సమస్యలను స్థానికులు తన దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయప్రకాష్, బోయిన్‌పల్లి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఖదీరవన్, మాజీ వైస్ చైర్మన్ చింతల వేణుగోపాల్ రెడ్డి, పీడి అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వారాసిగూడ చౌరస్తాలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారులు ఏర్పాటు చేసిన సామగ్రిని తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

బౌద్ధనగర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): 'సీతాఫల్‌మండి, వారాసిగూడలో నిత్యం ట్రాఫికర్ అనే శీర్షికన మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనానికి ట్రాఫిక్ పోలీస్ అధికారులు స్పందించారు. చిలకలగూడ, వారాసిగూడ లా అండ్ ఆర్డర్ పోలీసుల సమన్వయంతో చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు రోప్ ఆపరేషన్‌ను నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పీహెచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. అక్రమంగా ఏర్పాటు చేసిన షెడ్డులను తొలగించారు. అక్రమంగా పార్కింగ్ చేసిన వాహనాలకు, కొంతమంది దుకాణ యజమానులకు చలాన్లు విధించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించడంపై స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై మళ్లీ దుకాణాలు ఏర్పాటుచేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు.



బైక్‌ర్యాలీని నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: బీజేపీ

బౌద్ధనగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హామీలను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి విమర్శించారు. ఆరు గ్యారెంటీలంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ హామీలను నెరవేర్చడంలో విఫలమైనందుకు నిరసనగా మంగళవారం వారాసిగూడ ఆర్ట్స్ కాలేజీ టర్నింగ్ పాయింట్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సారంగపాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది అయిన నేపథ్యంలో ప్రజాపాలన విజయోత్సవాల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారన్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని పేదలందరూ ఆరు గ్యారంటీలను నమ్మి ఓటేస్తే వారిని బజారు పడేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని అన్నారు. ఆర్ట్స్ కాలేజీ నుంచి మొదలైన బైక్ ర్యాలీ లాలాపేట వరకు కొనసాగింది. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవిప్రసాద్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి,కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, నాయకులు పోచయ్య, రమేష్, మేకల కీర్తి హర్షకిరణ్, శారదామల్లేష్, సీతాఫల్‌మండి డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు పాల్గొన్నారు.

వర్గీకరణకు అడ్డుపడే మాలలు మనువాదులే: ఎంఎస్‌పీ

బౌద్ధనగర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అడ్డుపడే మాలలంతా మనువాదులేనని మాదిగ సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్‌పీ) అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పార్శిగుట్ట అశోక్ సేవా సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాలలను తాము సోదరులుగా భావిస్తామని, ఎవరైతే ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారో వారిని మనువాదుల్లా భావిస్తామన్నారు. ఎంఆర్‌పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను ఉద్దేశించి ఇష్టానుసారంగా మాట్లాడితే సహించబోమన్నారు. రెంజర్ల మహాసేన, రాజేష్‌లు తమ స్థాయి తెలుసుకొని మాట్లాడాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి టి.శివ ప్రసాద్, నాయకులు సత్యనారాయణమాదిగ, రఘు, నరేష్, రాజ్‌కుమార్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణను విమర్శిస్తే తీవ్ర పరిణామాలు..

తార్నాక, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగను వ్యక్తిగతంగా విమర్శిస్తే తీవ్ర పరిణామాలుంటాయని ఎంఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు అన్నారు. మంగళవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు మాట్లాడారు. కొంతమంది స్వార్థపరులైన మాల మనువాదులు 30 సంవత్సరాలుగా రిజర్వేషన్ల దోపిడీకి పాల్పడుతూ.. 58 కులాల వాటాను ఒక్క కులమే అనుభవిస్తోందని మండిపడ్డారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి పల్లెర్ల సుధాకర్, కొమ్ము శేఖర్, మందరాజు, దుపెల్లి అనిల్, అజయ్, విజయ్, కొల హరీష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

నిత్యం ఇదే పరిస్థితి!

- డైమండ్ పాయింట్ చౌరస్తాలో మురుగు పరుగు
- దుర్వాసనతో వాహనదారులు, స్థానికుల అవస్థలు
- డెంగీ, మెదడు వాపు వ్యాధుల బారిన పడతామని ఆందోళన

బోయిన్‌పల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ 6వ వార్డు పరిధిలోని డైమండ్ పాయింట్ చౌరస్తా మార్గంలో డ్రైనేజీ పైపు నుంచి మురుగు నీరు నిత్యం రోడ్డుపై ఏరులా పారుతోంది. ఎగసి వస్తున్న దుర్వాసనతో ఆ మార్గంలో వెళ్లే పాదచారులతో పాటు ట్రాఫిక్ సిగ్నల్ పడినప్పుడు ఆగుతున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ పైప్‌లైన్‌కు మరమ్మతు చేయించడంలో కంటోన్మెంట్ బోర్డు అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటం వల్లే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు, వాహనదారులు ఆరోపిస్తున్నారు. మురుగు నీటి వల్ల స్థానికంగా పందుల సంచారం పెరిగిందని, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని, దీంతో తమకు మెదడ వాపు, డెంగీ, మలేరియా వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని చౌరస్తా పక్కనే ఉన్న కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులతో పాటు స్థానికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కంటోన్మెంట్ బోర్డు అధికారులు డ్రైనేజీ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి మురుగు నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బోయిన్‌పల్లి డైమండ్ పాయింట్ చౌరస్తాలో పారుతున్న మురుగు

దివ్యాంగుల సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

- కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడుపల్లి, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మారేడుపల్లి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వల చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేశ్ మాట్లాడుతూ, అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మన్నలను పొందుతుంటే బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఒక్కటై ప్రభుత్వంపై దాడి చేయడం సిగ్గు చేటన్నారు. డివిజన్‌లో 202 మంది అర్హులైన దివ్యాంగులను గుర్తించి దాదాపు రూ. 18 లక్షల విలువ చేసే ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లు, హియరింగ్ ఎయిడ్స్ వంటి 19 రకాల పరికరాలను ప్రభుత్వం అందజేస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవాలను జరుపుకుంటున్న సమయంలో ప్రతిపక్షాలు అర్థం లేని ఆరోపణలు చేస్తున్నాయని ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో సీఎం ప్రజలకు అందుబాటులో లేకుండా నియంతలా వ్యవహరించే వారని, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి నిత్యం ప్రజల మధ్యలో ఉంటున్నారని అన్నారు. నల్లధనం తీసుకువచ్చి ప్రజల అకౌంట్లలో రూ. 15 లక్షల వేస్తామని, ఏడాదిలో 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ గతంలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని, దీనికి ఆ పార్టీ నాయకులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్, జీహెచ్ఎంసీ డిప్యూటీ జోనల్ కమిషనర్ సమ్మయ్య, స్థానిక కార్పొరేటర్ కొంతం దీపిక, నాయకులు సంకి రవిందర్, సి.వైష్ణవి, శ్యాంసుందర్ రెడ్డి, సి.సంతోష్ యాదవ్, పెద్దాల నరసింహ యాదవ్, గౌరీ శంకర్, బాబు, బల్వంత్ రెడ్డి, సాంసంగ్ రాజ్, ఎస్.వెంకటేష్, డాక్టర్ సుజాత పాల్గొన్నారు.



దివ్యాంగుడికి ట్రైసైకిల్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్, చైర్మన్ శ్రీకాంత్ గౌడ్, కార్పొరేటర్ కొంతం దీపిక, డీసీ సమయ్య

దివ్యాంగులకు జీహెచ్‌ఎంసీ అండ

బౌద్ధనగర్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతారెడ్డి, సికింద్రాబాద్ సర్కిల్ ఉపకమిషనర్ సుభాష్‌రావు, కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దివ్యాంగులకు జీహెచ్ఎంసీ అండగా ఉంటుందని, వారికి అవసరమయ్యే వీల్‌చైర్లు, ట్రై సైకిళ్లు చేతికర్రలు పంపిణీ చేస్తోందని అన్నారు. అనంతరం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దివ్యాంగులకు వీల్‌చైర్లను అందజేశారు. కార్యక్రమంలో ఈఈ వెంకటేశ్, డీపీఓ శ్రీనాథ్, వరుణ తదితరులు పాల్గొన్నారు.



వికలాంగుల దినోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ తదితరులు

ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు

- చండీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు
- నేడు అమ్మవారి కల్యాణం

బౌద్ధనగర్,డిసెంబర్,3,(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ బీదల బస్తీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ 16 వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల నేపథ్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం అమ్మవారికి పంచామృత అభిషేకం, మంగళస్నానం చేయించి చండీదేవిగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు నరేశ్, నిఖిల్ చండీహోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శు లు సీతారామ్, శేషగిరావు మాట్లాడుతూ.. ఆలయం ప్రారంభోత్స వం నుంచి ప్రతీ సంవత్సరం డిసెంబరు 4వ తేదీన అమ్మవారికి కల్యా ణం జరిపిస్తున్నామని, ఇదే క్రమంలో బుధవారం ఉదయం నిర్వహించే కల్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పూజా కార్యక్రమాల్లో జీఎం మల్లేశ్, బాలరాజు గౌడ్, గోవింద్, రాజమౌళి, అంజనేయులు,సత్యనారాయణ,శ్రీనివాస్, శేఖర్, లక్ష్మణ్, గిరి పాల్గొన్నారు.



చండీ హోమానికి హాజరైన భక్తులు



కార్యక్రమంలో పాల్గొన్న జలమండలి ఉద్యోగులు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో డబ్ల్యూడబ్ల్యూఈయూ విఫలం

- టీజేఈయూ నాయకులు సతీష్, రాజ్‌రెడ్డి ఆరోపణ

రాంగోపాల్‌పేట్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జలమండలి ఉద్యోగుల కీలక సమస్యలను పరిష్కరించడంలో ప్రస్తుత వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ (డబ్ల్యూడబ్ల్యూఈయూటీజీ) విఫలమైందని తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ (టీజేఈయూ) నాయకులు సతీష్, కె.రాజ్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఎంజీ రోడ్డులోని డివిజన్-7 నల్లగుట్ట సెక్షన్‌లో తెలంగాణ జలమండలి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది ఉద్యోగులు టీజేఈయూ గౌరవ అధ్యక్షుడు, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ నేతృత్వంలోని ఆ సంఘం అధ్యక్షుడు సతీష్, కె.రాజ్‌రెడ్డిలకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... రాబోయే యూనియన్ ఎన్నికలో త్రిశూల్ గుర్తుకు ఓటు వేసి, తమ నాయకత్వాన్ని బలోపేతం చేసే వ్యక్తులను గెలిపించాలని జలమండలి ఉద్యోగులు సమష్టిగా నిర్ణయించుకున్నారన్నారు. హెచ్ఆర్, నామినల్ మస్టర్ రోల్, పీఆర్సీ, జనరల్ ట్రాన్స్‌ఫర్లు, పదోన్నతుల విషయంలో ప్రస్తుత యూనియన్ ఎలాంటి చొరవ తీసుకోలేదన్నారు. కార్యక్రమంలో టీజేఈయూ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజ్, యూనియన్ కార్యవర్గ సభ్యులు దేవేందర్, రాజు, ఆనంద్ రెడ్డి, రాజు, రామచంద్ర, అజయ్‌నాథ్, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, బి.మహేష్, ఓం ప్రకాష్, మహమ్మద్ జాంగీర్, నరసింహారెడ్డి, పరమేష్ పాల్గొన్నారు.

తుకారాంగేట్ మీదుగా 'గుట్ట'కు బస్సులు నడపాలి

- ఆర్టీసీ అధికారులకు బీజేపీ నేతల వినతి

అడ్డగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ నుంచి యాదగిరిగుట్టకు తుకారాంగేట్ మీదుగా ఆర్టీసీ బస్సులు నడుపాలని బీజేపీ సీనియర్ నాయకులు నర్సింగ్‌రావు, సత్యనారాయణ మంగళవారం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బీంరెడ్డి, కంటోన్మెంట్ బస్సు డిపో మేనేజర్ సుధాకర్ రావులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నర్సింగ్‌రావు మాట్లాడుతూ, సికింద్రాబాద్ జూబ్లీ బస్టాండ్ నుంచి సంగీత్ చౌరస్తా, మెట్టుగూడ హబ్సీగూడ మీదుగా యాదగిరిగుట్టకు ఆర్టీసీ బస్సులు నడస్తున్నాయని, అదే కాకుండా జూబ్లీబస్టాండ్ నుంచి మారేడుపల్లి షేనాయ్ నర్సింగ్ హోం, అడ్డగుట్ట తుకారాంగేట్ మెట్టుగూడ ప్రాంతాల మీదుగా యాదగిరిగుట్టకు ఆర్టీసీ బస్సులు నడపాలని వినతి పత్రంలో కోరామన్నారు. యాదగిరిగుట్టకు వెళ్లేందుకు తుకారాంగేట్‌వాసులు సికింద్రాబాద్‌కు వెళ్లి బస్సులు ఎక్కాల్సి వస్తోందన్నారు. తుకారాంగేట్ మీదుగా యాదగిరిగుట్టకు బస్సులు నడిపతే ఆర్టీసీ ఆదాయం పెరగడంతో పాటు ఈ ప్రాంత వాసులకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు నర్సింగ్‌రావు సూచించారు.

బాక్సింగ్ పోటీల్లో ఆకాంక్షకు బంగారు పతకం

అడ్డగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : వరంగల్‌లో సోమవారం జరిగిన స్టేట్ బాక్సింగ్ పోటీల్లో సికింద్రాబాద్ అడ్డగుట్టకు చెందిన ఆకాంక్ష బంగారు పతకం సాధించింది. దీంతో ఆకాంక్షను ఈనెల 9న ఢిల్లీలో జరిగే జాతీయ బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేశారు. ఈమెకు కోచ్‌లు దుర్గాప్రసాద్, సత్యనారాయణ ఉన్నారు. కాగా, బాక్సింగ్‌లో ఆకాంక్ష ప్రతిభ గురించి తెలుసుకున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ ఆమెను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసా పత్రం అందజేశారు.



ఆకాంక్షను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్



కార్యక్రమానికి హాజరైన సీమా సిక్రీ తదితరులు

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

పద్మారావునగర్,డిసెంబర్,3,(ఆంధ్రజ్యోతి): పౌరులకు సైబర్ నేరాలపై సరైన అవగాహన లేకపోవడంతో అనేక మోసాలకు గురవుతున్నారని హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ అసోసియేట్ డైరెక్టర్ సీమా సిక్రీ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట డివిజన్ కృష్ణానగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో 8,9,10వ తరగతి విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ... సైబర్ నేరాలు అనేక విధాలుగా జరుగుతున్నాయని, వాటి నుంచి ఎలా రక్షణ పొందాలో వివరించారు. దాంతో పాటుగా సెల్‌ఫోన్లను మన అవసరాలకు వినియోగించాలి తప్ప వ్యసనంగా మారకూడదని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాకీ సెమీస్‌కు మధ్యప్రదేశ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ సబ్ జూనియర్ మహిళల చాంపియన్‌షిప్‌లో మధ్యప్రదేశ్ జట్టు సెమీ ఫైనల్లోకి ప్రవేశించింది. మంగళవారం సికింద్రాబాద్‌లోని ఆర్ఆర్‌సీ గ్రౌండ్‌లో జరిగిన క్వార్టర్స్ పోరులో మధ్యప్రదేశ్ 3-2తో డిఫెండింగ్ చాంపియన్ హరియాణాపై గెలిచింది. మరో క్వార్టర్స్ మ్యాచ్‌లో జార్ఖండ్ 12-0తో మహారాష్ట్రను చిత్తుగా ఓడించి, సెమీస్‌లో ప్రవేశించింది. ఈ జట్లతోపాటు మిజో రాం, ఒడిశా కూడా క్వార్టర్స్‌లో నెగ్గి, సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్నాయి.

మా సోదరుడి కుమార్తె వివాహానికి రండి

- సీఎంను ఆహ్వానించిన తలసాని

హైదరాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి):తన సోదరుడి కుమార్తె వివాహానికి రావాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం సీఎంను ఆయన నివాసంలో కలిసి ఆహ్వానపత్రికను అందించారు.

బస్తీ దవాఖానాను సందర్శించిన కార్పొరేటర్

బేగంపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బేగంపేటలోని శ్యామ్‌లాల్ బిల్డింగ్‌లో నిర్వహిస్తున్న బస్తీ దవాఖానాను మంగళవారం కార్పొరేటర్ టి.మహేశ్వరి సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో మందులు లేవని, టెస్టులు చేయడం లేదని, డాక్టర్ అందుబాటులో ఉండటం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. దవాఖానాలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో నర్స్ మందులు ఇవ్వడాన్ని గమనించిన కార్పొరేటర్ డాక్టర్ ఎందుకు రాలేదని సిబ్బందిని ప్రశ్నించారు. వెంటనే ఫోన్ చేసి డాక్టర్‌తో మాట్లాడారు. అయితే మరో ప్రాంతంలో హెల్త్ క్యాంపు ఉండడం వల్లే రాలేదని చెప్పినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంలో బస్తీ దవాఖానాల్లో మందులు ఉండటం లేదని.. వైద్యసేవలు సరిగా అందడం లేదని ఆమె విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సురేష్‌యాదవ్, నాయకులు తాళ్ల రాజయ్య, టి.శ్రీహరి, నరేష్ పాల్గొన్నారు.

యోగాతో మానసిక సమస్యలు దూరం

అమీర్‌పేట, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి):బీకేగూడ పార్క్‌లో రూ35 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న యోగా షెడ్డు పనులను మంగళవారం సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రస్తుత రోజుల్లో యోగా అనేది ప్రతి ఒక్కరి దినచర్యలో భాగమైందన్నారు. యోగాతో మానసిక సమస్యలు, ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందన్నారు. త్వరలోనే ఈ యోగా కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోని తీసుకొస్తామని ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొలను బాల్‌రెడ్డి, డివిజన్ ఇంజనీర్ సందీప్, ఉద్యానవన అధికారి సంధ్య, ఎస్ఆర్‌నగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్ అధ్యక్షులు భరత్ ప్రసాద్ దూబే, అనంతరెడ్డి, సురేందర్ నాయి, శౌరిరెడ్డి పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

విద్యార్థుల్లోని ప్రతిభ వెలికితీతకు ఎగ్జిబిషన్లు దోహదం

అడ్డగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించేందుకు ఎగ్జిబిషన్లు దోహదం చేస్తాయని మారీ స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ అనిత అన్నారు. మంగళవారం విజయనగర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో ఆ సంస్థ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు పనికి రాని వస్తువులతో తాము తయారు చేసిన వివిధ రకరకాల వస్తువులను ప్రదర్శనలో ఉంచారు. వీటిలో ఉత్తమ ఎగ్జిబిట్స్‌ను ఎంపిక చేసి మారీ స్వచ్ఛంద సంస్థ వారు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విజయనగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్ సులేమాన్, పావని, పల్లవి, రాఘవేంద్ర, ఉమామహేశ్వర్ రావు, కిరణ్ కోలేని, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యాచకురాలి కుమారుడి అదృశ్యం



ప్రణీత్‌కుమార్

బౌద్ధనగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న యాచకురాలి కుమారుడు అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. నామాలగుండు హనుమాన్ మందిరం ఎదురుగా ఫుట్‌పాత్‌పై నివసించే ఎ.అనురాధ కుమారుడు ఎ.ప్రణీత్‌కుమార్ (13) బెగ్గర్. గత నెల 14వ తేదీన 2 గంటలకు భిక్షాటన చేసేందుకు గాంధీ ఆస్పత్రి వద్దకు వెళ్లిన ప్రణీత్ కుమార్ అదృశ్యమయ్యాడు. దీంతో అనురాధ తన కుమారుడు కనిపించ టంలేదని సోమవారం రాత్రి చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇటుకల లారీ బోల్తా : తృటిలో తప్పిన ప్రమాదం

అడ్డగుట్ట, డిసెంబరు 3 (ఆంధ్ర జ్యోతి): అడ్డగుట్ట వెంకట్‌నగర్ బస్తీలో తాగునీటి పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలో మంగళవారం ఇటుకల లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా పడింది. డ్రైవర్ సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డాడు. అలాగే, ఆ సమయం లో రోడ్డుపై ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లైంది.

రైలు కిందపడి ఫైనాన్స్ వ్యాపారి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఫైనాన్స్ వ్యాపారి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన తుర్కపల్లి గేటు వద్ద చోటు చేసుకుంది. సికింద్రాబాద్‌రైల్వే హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారానికి చెందిన కత్తి సాయికృష్ణ (32) ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలంగా వ్యాపారంలో తీవ్రంగా నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం మేడ్చల్ సమీపంలోని తుర్కపల్లి రైల్వే గేటు వద్ద సికింద్రాబాద్ వైపు వచ్చే ఎంఎంటీఎస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.